VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 10 డిసెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 139



2లో

**ఆశా కార్యకర్తల ఆందోళనలో పోలీసుల అత్యుత్సాహం**

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# చరిత్ర పుటల్లో నిలిచే రోజు

- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- అందెశ్రీని సన్మానించిన సీఎం రేవంత్ రెడ్డి

## సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లు
- డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజు
- తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టం
- గతంలో ఒక పార్టీ తమ కుటుంబం కోసమే ఆలోచించింది
- కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నాది
- పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చింది
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీజీ'గా 'టీఎస్'

**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం హైదరాబాదులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వేదమంత్రాల సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గేయ రచయిత అందెశ్రీని సీఎం సన్మానించారు.గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్న కంకులు తెలంగాణ తల్లి చేతిలో పొందుపరిచారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. సచివాలయం, ట్యాంక్ బండ్ పరిసరాలు జనసముద్రంగా మారాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు చరిత్రలో చిరస్థాయిగా

మిగతా 2లో

రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, అవినీతి నుంచి అభివృద్ధి వైపు, విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు నడిపిస్తున్నాం. పదేళ్లపాటు ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక రాజకీయ పార్టీ.. వారి గురించి మాత్రమే ఆలోచించి... నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలన్న లక్ష్యంతో తెలంగాణ తల్లి విగ్రహానికి రూపమిచ్చే కీలక నిర్ణయాన్ని మంత్రులందరి సంపూర్ణ సహకారంతో తీసుకున్నాం.

-సీఎం రేవంత్‌రెడ్డి





"హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ వనరులను అదానీకి దోచిపెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రేవంత్,అదానీల చీకటి ఒప్పందాలపై రాహుల్ గాంధీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు,దాడులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందన్నారు."

# దొంగలతో రేవంత్ దోస్తీ

- అసెంబ్లీకి వెళ్తే అడుకోవల్సిన అవసరం ఏమిటి
- రాహుల్ గాంధీ అదానీని వ్యతిరేకిస్తే
- ప్రాణాలకు తెగించి రాష్ట్రం సాధించిన మహోన్నతుడు కేసీఆర్
- రేవంత్ సపోర్టు చేస్తాడా..?
- అసెంబ్లీలో రేవంత్ అక్రమాలను ఎండగడతాం మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్: దొంగలతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ చేస్తున్నాడని, అదానీ, రేవంత్ రెడ్డి ఒక్కటై తెలంగాణ ప్రజాలతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదానీ పట్ల కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. అదానీ, రేవంత్ దోస్తానాను శాసనసభ వేదికగా ఎండగడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. అమరులకు జోహార్.. వీరులకు జోహార్ అంటూ పాటపాడారు. అనంతరం కేటీఆర్

మిగతా 2లో

## రేవంత్ దుశ్చర్యకు తెలంగాణ కన్నీళ్లు

స్వలాభం కోసం తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చడం బాధాకరం

ఉద్యమతల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు : ఎమ్మెల్సీ కవిత



2లో..



2లో..

## చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

చెన్నమనేనికి రూ.30 లక్షల జరిమానా విధింపు

## తెలంగాణ తల్లి

## 4 కోట్ల బిడ్డల భావోద్వేగం



2లో..

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల శక్తి స్వరూపిణి తెలంగాణ తల్లి అని సీఎం చెప్పుకొచ్చారు.

తెలంగాణ తల్లి రూపకల్పనలో సంస్కృతి, సాంప్రదాయాలను తీసుకొచ్చామని తెలిపారు.

డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు పర్వదినం. తెలంగాణ ఏర్పాటు పునాది పడిన రోజు. అమరుల త్యాగాలకు అనుగుణంగా సోనియా తెలంగాణ ప్రకటన చేశారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియా నెరవేర్చారు.

వేగుచుక్క

# తెలంగాణ తల్లి 4 కోట్ల బిడ్డల భావోద్వేగం



హైదరాబాద్: డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీనెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు. భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు."స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపింది. తెలంగాణ తల్లి స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం.తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండుపూసలు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క–సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు.

అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి: భట్టి విక్రమార్క

తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించిన అంశంపై అధికార,

ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని ప్రభుత్వం నమ్ముతోందని చెప్పారు. ఇది అత్యంత ప్రాధాన్యంతో కూడుకున్న అంశమని.. దీనిపై అభిప్రాయాలు చెప్పే అవకాశం అందరికీ కల్పించినందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినమని.. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆనాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం చేత సోనియా గాంధీ ప్రకటన చేయించారని భట్టి విక్రమార్క గుర్తు చేశారు.

## చరిత్ర పుటల్లో నిలిచే రోజు

నిలిచిపోయే రోజు అని అన్నారు. సోనియా జన్మదినం రోజే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజని, కృష్ణా, గోదావరి నదులు హైదరాబాద్‌లో ప్రవహించినట్లు ఉందన్నారు. ఈరోజు తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టమని, తెలంగాణ వారికి ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని అన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందని, మా పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నారు. యావత్ తెలంగాణ మొత్తం పండగ చేసుకునే పర్వదినం డిసెంబర్ 9గా అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టి మొదటి ఏడాదిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుందని,



తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రం సమయంలో తెలంగాణ సంస్కృతిని అవహేళన చేశారని, నేడు మన సంస్కృతి సాంప్రదాయాలు చాటి చెప్పేలా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గత పాలకులు కుటుంబం గురించి ఆలోచించారే కానీ యావత్ తెలంగాణ గర్వించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలన్న ఆలోచనకు నోచుకోలేదంటూ బీఆర్ఎస్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తాను తెలంగాణ తల్లిని చూసిన సమయంలో తన తల్లిని చూసిన భావన కలిగిందని, అదే భావన యావత్ తెలంగాణ కలిగే విధంగా తెలంగాణ తల్లిని రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము 'టీఎస్'ను 'టీజీ'గా మార్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరూ 'టీజీ' అని రాసుకున్నారని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం 'టీఎస్' అని తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతిచోట 'జయ జయహే తెలంగాణ' వినిపించేదని, కానీ రాష్ట్రం వచ్చాక ఆ గేయానికి గౌరవం దక్కలేదని విమర్శించారు. అందుకే తాము ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. తెలంగాణ పదేళ్ల పాటు వివక్షకు గురైందన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిలూదారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తాము సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఎందరో కవులు, కళాకారులు, రచయితలు వారి పాటలతో యావత్ తెలంగాణ యువతను చైతన్యపరిచి ఉద్యమం వైపు సాగించడంతోనే తెలంగాణ సాధ్యమైందని సీఎం అన్నారు. తెలంగాణ కోసం గొప్ప కవులు, కళాకారులు కృషి చేశారని, వారిని సన్మానించుకోవడం సత్కరించుకోవడం మన బాధ్యతగా సీఎం పేర్కొన్నారు.వారిలో గూడా అంజయ్య, గద్దరన్న, బండి యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, యాదగిరి రావులకు ఫ్యూచర్స్ సిటీలో 300 గజాల స్థలము, ప్రభుత్వం నుండి కోటి రూపాయల ఆర్థిక సాయం, తామర పత్రాన్ని కూడా అందజేస్తున్నట్లు సీఎం బహిరంగ సభ సాక్షిగా ప్రకటించారు.

## సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ రాకపోతుండే

**తెలంగాణ తల్లి ఒక వ్యక్తికి.. ఒక కుటుంబానికి పరిమితం కాదు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్: సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ రాకపోతుండేనని.. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. డిసెంబర్ 9న తెలంగాణా ఏర్పాటు ప్రకటించిన సందర్భంగా సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ చిహ్నం చర్చ జరుగుతుందని.. తెలంగాణకు అధికారిక గేయం లేదు.. తెలంగాణ సెంటిమెంట్‌కి అనుగుణంగా తమ ప్రభుత్వం రాగానే రాష్ట్ర గీతాన్ని అధికారికంగా ఏర్పాటు చేశామని పొన్నం ప్రభాకర్ వివరించారు. 'తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ అధికారికంగా లేదు. అది ఒక పార్టీకి సంబంధించిన అప్లికెటెడ్ తప్ప.. రాష్ట్ర అధికారిక విగ్రహం కాదు. ఈరోజు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఆవిష్కరించుకుంటున్నం. తెలంగాణకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసుకుంటున్నాం. ఒక వ్యక్తికి, ఒక కుటుంబానికి పరిమితం కాదు తెలంగాణ తల్లి' అని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. '10 సంవత్సరాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఎందుకు ఏర్పాటు చేయలేదు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్లలో, పోలీస్ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలి. ప్రతి సంవత్సరం డిసెంబర్ 9 తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవం జరుపుకుందాం. తెలంగాణ ఏర్పడడానికి సోనియా గాంధీ కారణం. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు' అని మంత్రి వివరించారు. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన వారికి ఈ సభ నుండి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నం. రాజకీయంగా తెలంగాణ అంశాన్ని 10 సంవత్సరాలు చూశాం. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయలేదు. గత 10 సంవత్సరాలుగా ఉద్యోగులను ఇబ్బందులు పద్దారు. ఉద్యోగ నాయకులు పదవి విరమణ కాగానే వారికి పదవులు ఇస్తే.. వారు అనుకూలంగా ఉంటారేమో.. కానీ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయడానికి ఒక కమిటీ వేశారు. అందులో ఒక నిర్ణయం తీసుకున్నాం' అని పొన్నం వ్యాఖ్యానించారు. 'లోకాలిటీ సమస్య ఉంది. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారం చేస్తం. ఖమ్మం జిల్లాలో వరదలతో చాలా ప్రాంతాలు మునిగి రూ.10 వేల కోట్ల నష్టం జరిగితే.. ముష్టి రూ.400 కోట్లు ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా నిధులు తెచ్చుకునేలా ఉండాలి. ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ తల్లి సేవ చేసుకోవాలి. తెలంగాణ తల్లి రూపంలో రాచరికపు పాలన లేకుండా చూశాం. ఒకవైపు అభయ హస్తం.. మరోవైపు పచ్చని పాడి పంటల పచ్చదనం.. ఇది

అభివృద్ధికి నిదర్శనం. కిరీటాలు లేకుండా..గ్రామాల్లో కనిపించే గ్రామ వనితలాగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంది' అని పొన్నం వివరించారు.'తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉండేలా విగ్రహ ఏర్పాటు ఉంటుంది. అందరి ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎన్నో హామీలు అమలు చేశాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. 2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేశాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్.. ఇలా ఎన్నో పథకాలు అమలు చేశాం. ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయి' అని మంత్రి వెల్లడించారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై రోడ్డు ప్రమాదం

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. నల్గొండ నుంచి హైదరాబాద్ వెళుతున్న డీలక్స్ బస్సు.. ముందు వెళుతున్న ఓ లారీని ఢీకొట్టింది. దీంతో ప్రమాదం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ మృతదేహం క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. దీంతో క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నిలిచింది.

## ప్రేమించలేదని బాలికపై ఆక్రోశం

**పెట్రోల్ పోసి తగులబెట్టిన యువకుడు**

నంద్యాల: నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది. మరో ప్రేమోన్మాది చర్యకుఎ యువతి బలయ్యింది. ప్రేమించలేదనే కారణంతో బాలికపై యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాలిక మృతిచెందింది. యువకుడికి మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం సామర్లకోటకు చెందిన బాలికను కలుగొట్లకు చెందిన యువకుడు రాఘవేంద్ర (21) కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను నందికొట్కూరులోని అమ్మమ్మ ఇంటికి పంపారు. ఆరు నెలల క్రితం యువకుడు అక్కడికి వచ్చాడు. దీంతో ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చేరవేశారు. బాలిక స్నేహితులు ఎవరు వచ్చినా ఇంటికి రానివ్వొద్దని వారు సూచించారు. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆ రాఘవేంద్ర మళ్లీ వచ్చాడు. చదువుకునే గదిలో బాలిక నిద్రిస్తుండగా డోర్ కొట్టాడు. డోర్ తెరవడంతో లోపలికి వెళ్లి గడియపెట్టాడు. ఆ తర్వాత కాసేపటికి బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు పెడుతూ అక్కడికక్కడే మృతిచెందింది. యువకుడికీ మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. అతడు గడియ తీసి పారిపోతుండగా కుటుంబసభ్యులు, స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలతో ఉండటంతో రాఘవేంద్రను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## మళ్లీ రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్:** బీసీ ఉద్యమ నాయకుడు ఆర్ కృష్ణయ్యకు మళ్లీ రాజ్యసభ పదవి వరించింది. భారతీయ జనతా పార్టీ ఆర్ కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ క్రమంలో ఆర్ కృష్ణయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మళ్లీ రాజ్యసభ పదవి వరించడంతో ఆర్ కృష్ణయ్యకు బీసీ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తన పదవీకాలం మరో నాలుగేండ్లపాటు ఉండగానే తన పదవికి ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇక 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. అనేక బీసీ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. బీసీల రిజర్వేషన్లు, వారి అభివృద్ధి కోసం అనేక పోరాటాలు నిర్వహించారు.

## ఆశా కార్యకర్తల ఆందోళనలో పోలీసుల అత్యుత్సాహం

హైదరాబాద్: కోఠి డీఎం ఈ కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లపై పోలీసులు చేయి చేసుకున్నారు. ఎగిరెగిరి ఓ ఆశా వర్కర్‌ను మహిళా పోలీసులు కొట్టారు. బాధిత ఆశా వర్కర్ ఆ దెబ్బలకు తాళలేక తల్లడిల్లిపోయింది. ఆమెను పోలీసులు అసభ్యకర పదజాలంతో దూషించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.18000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు యత్నించారు. దీంతో ఆశా వర్కర్లకు పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు జులుం నశించాలంటూ పెద్ద ఎత్తున ఆశావర్కర్లు నినాదాలు చేశారు. ఇక ఆశావర్కర్లకు మద్దతు నిలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## పార్లమెంట్ ఎదుట ఎంపీల ఆందోళన

**అదానీ ఫొటోలతో రాహుల్ నిరసన**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అదానీ వ్యవహారంపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా విపక్ష ఎంపీలంతా నిరసనకు దిగారు. ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలకు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు హాజరుకాలేదు. కాగా, కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. ముఖ్యంగా శివసేన (యూబీటీ), టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీలు శనివారం మమత చేసిన ప్రకటనపై స్పందించాయి. పరోక్షంగా ఆమెకు మద్దతు తెలిపి, కూటమిలో నాయకత్వ మార్పు చేపట్టాలన్న సంకేతాలు ఇచ్చాయి. దానికి తోడు ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో కూటమి పరాజయం, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఒకే అంశం(అదానీ అవినీతి)పై కాంగ్రెస్ కేంద్రాన్ని నిలదీయడం, అధికార పార్టీ సభను వాయిదా వేయడం తదితర అంశాలు కూటమిలోని మిగతా పార్టీలకు ఏమాత్రం రుచించడం లేదు. దీంతో కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్‌ను తప్పించాలని కొన్ని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి.

## అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి చీకటి ఒప్పందాలు

హైదరాబాద్: అదానీ దొంగ అని, అవినీతి చేసిండని రాహుల్ గాంధీ తిడితే, రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శాసనసభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టులు చేయడం పట్ల హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదానీతో వేలకోట్ల రూపాయలు ఒప్పందాలు చేసుకుంటడు. ఇదెక్కడి న్యాయమన్నారు. వివిధ మార్గాల్లో ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అక్రమ సంబంధాలు, చీకటి ఒప్పందాలు బయట పడుతాయని ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.సభ ఏకపక్షంగా జరిపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదానీతో చీకటి ఒప్పందం బయటపడిందని, మేము ప్రశ్నిస్తామని భయపడుతున్నరు అని హరీశ్‌రావు తెలిపారు. మమ్మల్ని సభలోకి రాకుండా ఎందుకు ఆపుతున్నావు రేవంత్ రెడ్డి, పార్లమెంట్‌లో రాహుల్, ప్రియాంకలు అదానీ, మోడీ బాయి బాయి అనే స్లోగన్స్ తో టీషర్ట్స్ వేసుకున్నరు.

## చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే..

హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పౌరసత్వంపై ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ సందర్భంగా రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. ఆయనకు 30 లక్షలు జరిమానా విధించింది.బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. పౌరసత్వం విషయంలో రమేష్ పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. పదిన్నర సంవత్సరాల పాటు ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చెన్నమనేనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వాదనల సందర్భంగా కోర్టును తప్పుదోవ పట్టించినందుకు హైకోర్టు సీరియస్ అయ్యింది. ఆయన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు తెలిపింది. రమేష్ కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారు.. ఫేక్ డాక్యుమెంట్స్ సమర్పించారు. కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

జర్మనీ పౌరసత్వంతోనే ఆయన అక్కడికి వెళ్లారని కోర్టు తెలిపింది. దీంతో, చెన్నమనేనికి రూ.30 లక్షలు జరిమానా విధించింది. జరిమానాలో రూ.25 లక్షలు కాంగ్రెస్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఇవ్వాలని తెలిపింది. మిగిలిన రూ.5లక్షలను హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశం. నెల రోజుల్లో చెల్లింపులు పూర్తిచేయాలని చెన్నమనేనికి సూచించింది.

## రేవంత్ దుశ్చర్యకు తెలంగాణ కన్నీళ్లు

హైదరాబాద్: తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం దురదృష్టకరమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుశ్చర్యకు తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతుందని తెలిపారు. ఉద్యమ తల్లిని నేడు కాంగ్రెస్ తల్లిగా మార్చారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రహదారిలో ఏర్పాటు చేసి.. తెలంగాణ తల్లి అని చెబుతున్న విగ్రహాన్ని చెరసాలలో ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని వెల్లడించారు. కోట్లాది మంది తెలంగాణ బిడ్డల్లో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బతుకమ్మతో పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదని తెలిపారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారని మండిపడ్డారు. బతుకమ్మను మాయం చేయడం దురదృష్టకరమని చెప్పారు. బతుకును ఆగం చేశారని, బతుకమ్మను మాయం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లికి నివాళులు అర్పించాలి అనుకుంటే గన్ పార్క్ దగ్గర ముక్కు నెలకు రాయాలన్నారు. ఉద్యమకారులపై తుపాకీ ఎక్కు పెట్టినందుకు తెలంగాణ తల్లికి నివాళులర్పించే హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదని చెప్పారు.

## దొంగలతో రేవంత్ దోస్తీ



మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్ర సాధనలో భాగంగా పదవీ త్యాగంతో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైందన్నారు. ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడిన తెలంగాణ మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ దీక్షకు దిగి దేశ రాజకీయ వ్యవస్థను మెడలు వంచిన రోజు, తెలంగాణ ప్రజా కదలికలతో ఢిల్లీ పాలకుల గుండెల్లో గుబులు పుట్టినరోజు డిసెంబర్ 9. దీక్ష ఫలవంతమైన డిసెంబర్ 9న దీక్షా విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరులకు ఘనంగా నివాళులు అర్పించామని, కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన తెలిపారు. దేశ వ్యాప్తంగా అదానీ మంచివాడు కాదని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నదని, కానీ రాష్ట్రంలో మాత్రం అదానీతో రేవంత్ రెడ్డి అలయ్ బలయ్ తీసుకుంటున్నాడని ఆరోపించారు. రాహుల్ గాంధీ అదానీపై ఇతర రాష్ట్రాల్లో దుర్మార్గపు ప్రచారం చేస్తుంటే ఇక్కడమాత్రం మంచివాడని అన్నట్లుగా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అదానీ, రేవంత్ ఒక్కటై తెలంగాణ ప్రజానికంతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడతామనన్నారు. గురుకుల, లగచర్లలో గిరిజనుల నుంచి బలవంతంగా భూములు లాక్కొంటున్న విధానాన్ని, రైతన్నల సమస్యలు, నెరవేరని గ్యారంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిన విధానాన్ని, రాష్ట్రంలో నెలకొన్న ప్రతి సమస్యను అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిని, ముఖ్యంగా తెలంగాణ తల్లిని మారుస్తానంటున్న రేవంత్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనను నిరసిస్తూ తెలంగాణ ప్రజల ఆర్తిని రెండు సభల్లో వినిపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

వేగుచుక్క

# ప్రభుత్వ "ఇంజనీరింగ్" కళాశాలను ఏర్పాటు చేయాలి.




**అసెంబ్లీలో జిల్లా ప్రజా ప్రతినిధులు మాట్లాడాలి.**

**పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, డిసెంబర్ 9:**

జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ పిడిఎస్ యూ ఆద్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ, గత కొన్ని ఏండ్లుగా నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ ఉన్న గాని పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారు గాని, అధికారంలో వచ్చిన తర్వాత అమలు చేయడం లేదన్నారు.

ఇంజనీరింగ్ విద్య కోసం విద్యార్థులు హైదరాబాదు వెళ్లి చదువుకోవలసి వస్తుందని, లక్షల రూపాయలు అదనపు భారం వల్ల పేద విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. మన దగ్గర యూనివర్సిటీ ఉండి కూడా ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే నాలుగు జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు.

జిల్లాలోని ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో మాట్లాడి నిజామాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ పి.డి.ఎస్.యూ నాయకులు అక్షయ్, నిఖిల్, బిందు, రాకేశ్, రాజేందర్, రవీందర్, బీమేశ్, కార్తీక్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# మల్బరీ సాగు వైపు దృష్టి పెట్టాలి.

**ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్.**




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 9:**

మల్బరీ సాగు వైపు దృష్టి పెట్టాలని ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్ అన్నారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో బిక్కనూరు మండలం జంగంపల్లి రైతు వేదికలో సోమవారం కొత్త రైతులకు మల్బరీ, పట్టుపురుగుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, మల్బరీ సాగు చేస్తే 20 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతినెల లక్ష ఇరవై వేల రూపాయల ఆదాయం వస్తుందని చెప్పారు. మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం కొనసాగు తోందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెంట్రల్ సిల్క్ బోర్డు సాంకేతిక అధికారి రాఘవేంద్రరావు మాట్లాడుతూ, మల్బరీ సాగులో వంగడాల ప్రాముఖ్యతను తెలిపారు. నాణ్యమైన మల్బరీ ఆకు తయారు చేసే విధానాన్ని వివరించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ, రైతులు పంటల మార్పిడి పద్ధతిని అవలంబించాలని తెలిపారు. మల్బరీ సాగు పై రైతులు ఆసక్తి పెంచుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సాంకేతిక సహాయకులతో గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీని వినియోగించుకోవాలని కోరారు. మల్బరీ సాగులో అధిక దిగుబడి సాధించిన రైతు హర్షాద్ ను ఈ సందర్భంగా శాస్త్రవేత్త సన్మానించారు. సమావేశంలో జిల్లా సెరికల్చర్ అధికారి ఐలయ్య, రాజయ్య, సాంకేతిక సహాయకుడు నాగేందర్ రావు, ఉమ్మడి జిల్లా రైతులు బుచ్చిరెడ్డి, హర్షద్, ఏఈఓ లిఖిల్ రెడ్డి, తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో నలంద విద్యార్థుల ప్రతిభ













వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, డిసెంబర్ 9: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్ స్పయిర్, రాష్ట్రీయ వైజ్ఞానిక ప్రదర్శన 2024- 25 లో ఆర్మూర్ పట్టణంలో గల నలంద హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థుల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచారు. సైన్స్ ఎగ్జిబిషన్ లో నలంద హై స్కూల్ విద్యార్థులు సిఏచ్. సహస్ర, శ్రీ లక్ష్మి " న్యాచురల్ ఫార్మింగ్ " ప్రదర్శన ద్వారా రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ప్రదర్శనలో వ్యవసాయదారులకు నూతన పద్ధతులు తెలియజేశారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో స్టేట్ లెవల్ కు సెలెక్ట్ కావడం పట్ల నలంద యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం విద్యార్థులను, ఉపాధ్యాయుల సమక్షంలో సర్టిఫికెట్, మెడల్స్ తో నలంద హై స్కూల్ కరెస్పాండంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ అశోక్, సందీప్, నిఖిల పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయికి ప్రదర్శనకు ఎంపిక.**

**విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.**

# దీన్ దాయాళ్ జాతీయ ఉపకార వేతనానికి "సత్యశోధక్" విద్యార్థి ఎంపిక.

**- అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, డిసెంబర్ 9**

'దీన్ దాయాళ్ స్పార్ష్ యోజన' ద్వార ఉపకార వేతనాల కొరకు భారత తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పిలాటలి ప్రిలిమినరీ, ప్రాజెక్ట్ లెవల్-2లో సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి పి.సిద్దార్థ్ ప్రతిభ కనబరిచారు. దీనితో జాతీయ ఉపకార వేతానానికి ఎంపిక అయ్యారు. పిలాటలి ప్రాజెక్ట్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న పి.సిద్దార్థ్ భారతీయ శిల్పకళ నిర్మాణాలు ( ఆర్కిటెక్చర్ ఇన్ ఇండియా) అనే అంశంపై తపాలా శాఖ రూపొందించిన భారతీయ శిల్పకళ నిర్మాణాలకు సంబంధించి స్టాంపులను సేకరించి, వాటి చారిత్రక వివరాలను నైపుణ్యంతో ప్రాజెక్టు తయారు చేశారు. ఈ ఉపకార వేతనానికి ఎంపిక పట్ల సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికను అందించి, సత్కరించారు.

ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను వెలికి తీయడం, అంతర్గతంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయుటకు ఇలాంటి పోటి పరీక్షలు దోహదపడతయాని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాటోకాల్ ఉల్లంఘనలపై అసెంబ్లీలో కేవీఆర్ ఆగ్రహం.

**- మంత్రి శ్రీధర్ బాబు సీట్లో కూర్చుని నిరసన.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 9:**

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు సీట్లో కూర్చుని నిరసన తెలిపారు. మంత్రి సీట్లో ఎమ్మెల్యే కూర్చోవడంపై అభ్యంతరాలు రావడంతో ఎమ్మెల్యే తనదైన శైలిలో స్పందించారు. కాసేపు మంత్రి సీట్లో కూర్చుంటేనే ప్రొటోకాల్ సమస్య వస్తుందని చెప్పారని.. తన నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. 8 నెలల క్రితం కలెక్టర్, ఇన్ ఛార్జి మంత్రి తీరుపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదన్నారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చ జరగాలని పట్టుబట్టారు.

# ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తల్లి సోనియా గాంధీ.

**- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 9:**




కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకురాలు, తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలు సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం రెడ్ క్రాస్ నందు ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మానల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, గెలుపు ఓటములను సమానంగా తీసుకొని, అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రతిరోజు దేశ అభివృద్ధి కోసం, దేశ ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి సోనియాగాంధీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టి దేశంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ప్రభుత్వం ఏర్పడడానికి సోనియా గాంధీ ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రజలు కృతజ్ఞతా భావంతో ఉండాల్సి వస్తే సోనియాగాంధీకి ఉండాలని, 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులు, అమరవీరుల త్యాగాలను గుర్తించిన సోనియా గాంధీ తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశ ప్రజల కోసం దేశం కోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి సోనియా గాంధీ గారిని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ భగవంతుని కోరుకుంటూనని అన్నారు.

ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నుడా చైర్మన్ కేశవేణు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి, ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్,

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ , జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ఫిషర్ మ్యాన్ చైర్మన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో బలమైన "సాహిత్య" వాతావరణం ఉంది.

- తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు, ప్రఖ్యాత కవి డాక్టర్ నందిని సిధారెడ్డి.
- జిల్లా కవులు రూపొందించిన "పచ్చబొట్టు" కవితా సంకలనం ఆవిష్కరణ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 9:**

నిజామాబాద్ జిల్లాకు చెందిన కవులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, జి నరసింహస్వామి, తిరుమల శ్రీనివాస్ ఆర్య, నరాల సుధాకర్ కలిసి రూపొందించిన "పచ్చబొట్టు" కవితా సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు, ప్రఖ్యాత కవి డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన నందిని సిద్ధారెడ్డి ప్రసంగిస్తూ నిజామాబాద్ జిల్లాలో బలమైన సాహిత్య వాతావరణం ఉందని అభినందించారు. జి నరసింహస్వామి కవిత్వంలో గాఢత, పద చిత్రాలు, ఘనపురం దేవేందర్ కవిత్వంలో ఉత్సాహం, ప్రాసంగికత, నరాల సుధాకర్ కవిత్వంలో విలక్షణ ఇతివృత్తం, తిరుమల శ్రీనివాస్ ఆర్య కవిత్వంలో క్లుప్తత లక్షణాలు కాగా డాక్టర్ నాళేశ్వరం శంకరం కవిత్వంలో ఈ అంశాలన్నీ కనిపిస్తాయని విశ్లేషించారు. నిజామాబాద్ కవులు రూపొందించిన పచ్చబొట్టు కవితా సంకలనం స్ఫూర్తిగా తీసుకొని ఇతర జిల్లాలలో కూడా కవితా సంకలనాలు తీసుకురావాలని తెలంగాణ రచయితల సంఘం సభ్యులకు సూచించారు. తెలంగాణలో వస్తున్న చిక్కని చక్కని కవిత్వానికి పచ్చబొట్టు కవితా సంకలనం నిదర్శనం అన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ పచ్చబొట్టు కవితా సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించారు. జనగామ జిల్లా తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు బిల్లా మహేందర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి నేటి నిజం సంపాదకులు బైస దేవిదాస్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్, తెలంగాణలో చేతుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షురాలు ఎం .కవిత, జి డి రమేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాపూజీ వచనాలయం

## ఎన్నికల్లో భక్తవత్సలం ప్యానల్ విజయం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 9:**

జిల్లా కేంద్రంలోని బాపూజీ వచనాలయం ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. బాస రాజేశ్వర్ ప్యానల్, భక్తవత్సలం ప్యానల్ చివరి నిమిషం వరకు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డాయి. ఆదివారం రాత్రి ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, సంయుక్త కార్యదర్శులు, 12 మంది కార్యవర్గ సభ్యుల పదవులను భక్తవత్సలం(ఢిల్లీ) ప్యానల్ క్లిన్ స్వీప్ చేసింది. అధ్యక్షుడిగా ఎన్నికైన భక్తవత్సలం ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాపూజీ వచనాలయం అభివృద్ధికి పాటు పడతామని హామీ ఇచ్చారు.

## బిఎల్ పి రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 9:**




నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14,15 తేదీల్లో జరిగే బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి రాష్ట్ర ప్రథమ మహా సభలను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరాములు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ పి రాష్ట్ర నాయకులు నాగారపు యెల్లయ్య, వడ్ల సాయికృష్ణ, జిల్లా నాయకులు గంగాధర్, స్వప్న, గంగమణీ, లక్ష్మి పాల్గొన్నారు.

# ఆనాడు బలి దేవత... నేడు తెలంగాణ తల్లి ఎట్లాయింది.

**నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఆగ్రహం.**

**తెలంగాణ విగ్రహం మార్పులో "బతుకమ్మ" లేకపోవడం ప్రజలను అవమానించినట్లేనని వెల్లడి.**

**కాంగ్రెస్ గ్యారంటీల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ డిమాండ్.**



**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్ :**

సోనియమ్మ జన్మదినం రోజున తెలంగాణ తల్లి ఉత్సవాలు ప్రతి సంవత్సరం జరపాలి అనేది బిజెపి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.
ఆనాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ బలి దేవత సోనియామ్మ అని, నేడు ఇటలీ రాణి సోనియామ్మ మెప్పు కోసం ఆమె జన్మదినన్ని తెలంగాణ తల్లి ఉత్సవాలుగా జరుపడాన్ని పూర్తిగా వ్యతిరేకస్తున్నాం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోనియమ్మ జన్మదినం రోజున, ప్రతి సంవత్సరం తెలంగాణ తల్లి ఉత్సవాలు జరపాలన్న ప్రతిపాదన పై నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం మాట్లాడారు.సోనియా జన్మదినమా తెలంగాణ తల్లి ఉత్సవాలు జరిపితే తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరుల ఆత్మలు గోషిస్తాయి అని తెలిపారు.
నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందిన రోజు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపకపోవడం పై ఉన్న మతలబ్ ఎంటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ విగ్రహం మార్పులో తెలంగాణ అస్తిత్వం, తెలంగాణకి ప్రతీక అయినా బతుకమ్మ పెట్టకపోవడం తెలంగాణను అవమానించినట్లే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రచారంలో ఉన్న శ్రద్ధ తెలంగాణ ప్రజలపైన లేదని, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను జోకడంలోనే వాళ్ళ సంవత్సర కాలం గడిచిపోయిందని ఏద్దేవా చేసారు.
కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు, హామీలు ఎగవేయడానికే సర్వే పేరుతో, ఉత్సవాల పేరుతో కాలయాపన చేస్తుందని దీనిని పూర్తిగా ఖండిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన గ్యారంటీల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేశారు.

# చేనేత కార్మికుల అకౌంట్లలోకి డబ్బులు!



హైదరాబాద్:తెలంగాణలో నేతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఎంతోమంది తనువు చాలిస్తున్నారు. అటు ఆశించిన స్థాయిలో రాబడి లేదు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది.సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సీఎం ఆదేశాలతో అధికారులు కదిలారు. చేనేత శాఖ రుణమాఫీపై కసరత్తు చేపట్టిందిరుణమాఫీ అమలుకు రూ.58 కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించి నిధుల విడుదల కోసం ఆర్థికశాఖకు దస్త్రం పంపింది.గత ప్రభుత్వం 2017 మార్చి 31 వరకు రుణమాఫీ అమలు చేసింది. దీంతో 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణలోని బ్యాంకులు, చేనేత కార్మికులు, సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల సమాచారాన్ని.. జిల్లాల నుంచి ప్రభుత్వం సేకరించింది.ఆ వివరాల ప్రకారం.. 7,250 మంది కార్మికులకు రూ.40.10 కోట్ల వ్యక్తిగత రుణాలు, 91 చేనేత సహకార సంఘాలపై రూ.18 కోట్ల మేరకు అప్పులున్నట్లు తేలింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో.. రుణ మాఫీకి రూ.58.10 కోట్లు అవసరమని చేనేత శాఖ ప్రతిపాదనలు పంపింది. కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితాను ఆర్థికశాఖకు అందజేసింది.ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభిస్తే.. రుణమాఫీ ప్రక్రియను చేపట్టేందుకు చేనేత శాఖ సిద్ధంగా ఉంది.చేనేత రుణమాఫీ కార్యక్రమాన్ని కార్మికులతో భారీఎత్తున నిర్వహించాలని రేవంత్ సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ కార్యక్రమంలోనే రేవంత్ రుణ మాఫీ నిధులను విడుదల చేస్తారని సమాచారం.తెలంగాణలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత రంగంలో జీవనోపాధి పొందుతున్నారని.. అధికారులు చెబుతున్నారు. వస్త్రాల తయారీలో వస్తున్న అధునాతన సాంకేతిక మార్పుల కారణంగా.. చేనేత రంగంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నూతన డిజైన్లు, వైవిధ్యతతో వస్త్రాల తయారీలో ముందుకెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్నకు చేయూత ద్వారా.. చేనేత కార్మికుడు పొదుపు చేసుకున్న డబ్బుకు రెండింతలు ప్రభుత్వం వాటాగా వారి అకౌంట్లో జమచేస్తోందని అధికారులు వివరిస్తున్నారు.

# గ్రూప్ 2 పరీక్షకు అంతా సిద్ధం



హైదరాబాద్:తెలంగాణ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేస్తుంది. ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1368 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. గ్రూప్-2 హాల్ టికెట్లను టీజీపీఎస్సీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. అభ్యర్థులు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 15, 16 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లతో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం సెషన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను 8.30 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఈ సమయం దాటిపోయిన తర్వాత వచ్చిన వారికి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని టీజీపీఎస్సీ ప్రకటించింది.టీజీపీఎస్సీ గ్రూప్-2లో మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ షెడ్యూల్ ప్రకారం... పేపర్-1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది. ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. హాల్టికెట్లు డౌన్లోడ్ సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040-23542185 లేదా 040-23542187 నంబర్లకు సంప్రదించాలని టీజీపీఎస్సీ తెలిపింది. లేదా. ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని పేర్కొంది.

# బీఆర్ఎస్ లో ఏం జరుగుతోంది

మెదక్:మొన్నటివరకు ఆ నియోజకవర్గం గులాబీ పార్టీలో అంతా ఆయనే చూసుకున్నారు. ఇప్పుడు ఆయన్ని కాదని కొత్త ముఖాన్ని తెరపైకి తెచ్చారు. దాంతో ఆ నియోజకవర్గంలో ఒక్కసారిగా గ్రూపు రాజకీయాలకు తెరలేచింది. మొన్నటివరకు సైలెంట్ గా ఉన్నవారు ఇప్పుడు వైలెంట్‌గా మారి సీనియర్ నేతను టార్గెట్ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం. 2014లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పట్లోళ్ల కిష్టారెడ్డి ఆకస్మిక మరణం తర్వాత 2016లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. దాంతో మొదటిసారి నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ జెండా ఎగిరింది. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ రెండోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటం ఎమ్మెల్యే కూడా అదే పార్టీ కావడంతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి బాగానే జరిగింది.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకి వచ్చేసరికి ఎమ్మెల్యేపై స్థానికంగా వ్యతిరేకత పెరిగింది. సొంత పార్టీ నేతలు, కార్యకర్తల నుంచే అసమ్మతి పెరగడంతో అధిష్టానం నష్టనివారణ చర్యలు చేపట్టింది. అయినా కూడా కారు పార్టీ పరాజయం పాలైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి దివంగత ఎమ్మెల్యే కిష్టారెడ్డి కుమారుడు పటోళ్ల సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడమే కారణమన్న ప్రచారం అప్పట్లో జరిగింది. బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భూపాల్ రెడ్డిపై కోపంతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరికొంతమంది భూపాల్‌రెడ్డిపై వ్యతిరేకత ఉన్నా పార్టీనే నమ్ముకుని సైలెంట్ గా ఉండిపోయారు. అయితే పార్టీలో మాజీ ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తి ఇప్పటివరకు ఎక్కడ బయటపడలేదు.కానీ ఒక్కసారిగా ఇప్పుడు పార్టీలో ఉన్న అసమ్మతి తెరపైకి వచ్చింది. రైతు భరోసాపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అన్ని మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చింది. నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ ఆందోళన చేయగా ఒకటే పార్టీ జెండా వేసుకుని రెండు గ్రూపులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే వర్గం ధర్నా చేసి వెళ్లిపోయాక..
మరో వర్గం బీఆర్ఎస్ కండువాలు వేసుకుని ధర్నా చేసి మాజీ ఎమ్మెల్యే వర్గానికి షాక్ ఇచ్చింది.మాజీ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఉన్న వాళ్లు ఆ ధర్నా చేశారట. ఈ ధర్నాని పార్టీతో సంబంధం లేని మచ్చేందర్ అనే ఓ నాయకుడు చేయించారన్న ప్రచారం జరుగుతుంది. భూపాల్ రెడ్డి పక్కకు పెట్టిన వారితో గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని తాను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు మచ్చేందర్ ప్రచారం చేసుకుంటున్నారు.

# మరో వివాదంలో కొండా సురేఖ



వరంగల్:మరో వివాదంలో మంత్రి కొండా సురేఖ.. ఈ సారి ఏం చేశారో తెలుసా? తెలంగాణ దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను వివాదాలు వెంటాడుతున్నాయి. ఆమె కావాలని చేస్తున్నారా.. లేక అనుకోకుండా వస్తున్నాయా తెలియదు కానీ, ఏదో ఒక వివాదం ఆమెను చుట్టుకుంటోంది.తెలంగాణ దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ. రేవంత్‌రెడ్డి క క్యాబినెట్‌లో మహిళా మంత్రి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులురాలు. కానీ, ఏడాది పాలనలోనే ఆమె మరోసారి మూడుసార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. మొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసి అందులోకి అక్కినేని కుటుంబాన్ని లాగారు. ఇప్పటికీ ఆ కేసు కొనసాగుతోంది. తర్వాత ఇంట్లో బీరు పార్టీ అంటూ ఆమె స్వయంగా తన స్నేహితురాలుకు చెప్పడం, ఆ వీడియో వైరల్ కావడం సంచలనంగా మారింది. తాజాగా వేములవాడ రాజన్న కోడెల వివాదం సదరు మంత్రిని చుట్టుకుంది.వేములవాడ రాజన్న క్షేత్రాన్ని దక్షిణ కాశీగా భావిస్తారు. ఇక్కడ కోడెను కట్టే సంప్రదాయం ఉంది. వేలాది కోడెలు రాజన్న ఆలయం ఆధీనంలో ఉంటాయి. అయితే ఇటీవల రాజన్న కోడెలు వరంగల్ జిల్లా గీసుకొంలో ప్రత్యక్షమయ్యాయి. కోడెల పంపిణీలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఇస్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోడెలు పక్కదిరి పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో భజరంగ్‌దళ్ నేతలు ఆందోళన చేపట్టారు. మంత్రి సిఫారసుతోనే ఆగస్టు 12న 49 కోడెలను రాంబాబు అనే వ్యక్తికి ఆలయాధికారులు అప్పగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రి మెప్పు కోసం నిబంధనలకు విరుద్ధంగా కోడెలను అప్పగించారని ప్రచారం జరుగుతోంది. రైతుకు కేవలం రెండు లేదా మూడు కోడెలు ఇవ్వాలి. కానీ, మంత్రి చెప్పారని ఒక్కరికే 49 కోడెలు అప్పగించడం ఇప్పుడు వివాదాస్పదమైంది.ఇదిలా ఉంటే రాంబాబు అనే వ్యక్తి మాత్రం తాను టెండర్ ద్వారా 49 కోడెలు క కొనుగోలు చేసినట్లు పోలీసులకు తెలిపాడు. కోడెల పక్కదారి విషయమై మంత్రి అనుచరుడైన రాంబాబుపై గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పశువుల వ్యాపారిగా ఉన్న మంత్రి అనుచరుడికి రాజన్న కోడెలు అప్పగించడంపై భక్తులు కూడా మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకే వ్యక్తికి కోడెలు ఇవ్వడం వెనుక మంత్రి ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. మంత్రి కొండా సురేఖ సిఫారసు చేసినట్లు చెబుతున్న లేఖ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై భక్తులు ఆంగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేములవాడకు కుటుంబంతో వచ్చిన కొండా సురేఖ.. దర్శనం కారణంగా స్వామివారికి మహానైవేద్యం ఆలస్యం అయింది. దీనిపైనా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా కోడెలను పక్కదారి పట్టించడంపై మండిపడుతున్నారు.





# "నవ్య భారతి"లో విద్యార్థుల జోష్

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 9:**

జిల్లా కేంద్రంలోని మాణిక్ బండార్ లో గల నవ్యభారతి గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు ఆట, పాటలు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వార్షికోత్సవ సంబరాలకు ముఖ్య అతిథులుగా నిజామాబాద్ డిఇఓ అశోక్ కుమార్, ప్రముఖ గాయకుడు పుట్టా ప్రంచల్ దాస్, రచయిత సోలమన్ విజయ్ కుమార్ హాజరయ్యి, తమ సందేశాలు ఇచ్చారు. కార్యక్రమం విజయవంతం పట్ల స్కూల్ యాజమాన్యం సంతోష్ కుమార్ సంతోష్ వ్యక్తం చేశారు.

ఈవెంట్ విజయవంతంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులు,

వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీ ప్రోత్సాహం తమను మరింత ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి స్ఫూర్తినిస్తుందని సంతోష్ కుమార్ పేర్కొన్నారు.







**ఘనంగా ఎన్ జీఎస్ వార్షికోత్సవం.**

**పాల్గొన్న డిఇఓ అశోక్ కుమార్, గాయకుడు పుట్టా ప్రంచల్ దాస్, రచయిత సోలమన్ విజయ్ కుమార్.**

**ఆనందం వ్యక్తం చేసిన స్కూల్ యాజమాన్యం సంతోష్ కుమార్.**





















